# బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించాలి

- బీఆర్‌ఎస్ పథకాలు నచ్చే బీజేపీ, కాంగ్రెస్ నుంచి వలసలు
- ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి




బీఆర్‌ఎస్‌లో చేరుతున్న బీజేపీ పట్టణ కిసాన్ సెల్ అధ్యక్షుడు బైరం సిద్ధిరాములు

రామాయంపేట, అక్టోబర్ 18: మూడోసారి బీఆర్‌ఎస్ పార్టీకి భారీ మెజార్టీతో హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని, మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి గెలిపించాలని ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం రామాయంపేటలో నిర్వహించిన సమావేశంలో బీజేపీకి చెందిన కిసాన్ సెల్ పట్టణ అధ్యక్షుడు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, మూడోసారి సీఎం కేసీఆరేనని అన్నారు. ప్రతి పక్షాల కల్లబొల్లి మాటలు నమ్మితే అసలుకే ఎసరు వస్తుందని, కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మవద్దన్నారు. ఎక్కడ చూసినా కాలువల్లో, బావుల్లో నీళ్లు పొంగి పొర్లుతున్నాయన్నారు. గతంలో కంటే మరిన్ని ఎక్కువ సీట్లు సాధిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, సరాఫ్ యాదగిరి, బాలరాజు, కౌన్సిలర్లు దేమె యాదగిరి, గజవాడ నాగరాజు, కొండల్‌రెడ్డి, పరమేశ్, కుందెన స్వామి, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌కే మా మద్దతు



గజ్వేల్‌లో ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి అందజేస్తున్న నియోజకవర్గ ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులు

- గజ్వేల్‌లో ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యుల ఏకగ్రీవ తీర్మానం
- సీఎం కేసీఆర్ పాలనలో గజ్వేల్ అభివృద్ధి
- వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు
- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌డ్డి

గజ్వేల్, అక్టోబర్ 18 : గజ్వేల్ నియోజకవర్గ ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులు కేసీఆర్‌కే తమ మద్దతు ప్రకటించి ఏకగ్రీవ తీర్మానం చేశారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని వైష్ణవి గార్డెన్స్‌లో జరిగిన ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యుల నియోజకవర్గ సమావేశంలో ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు పంగ మల్లేశం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌తోనే గజ్వేల్ రూపురేఖలు మారాయని తెలిపారు. గజ్వేల్‌లో ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులను గుర్తించి ప్రత్యేకంగా భవనాన్ని మంజూరు చేశారని, త్వరలోనే అందుబాటులోకి వస్తుందన్నారు. గ్రామాల్లోని ప్రజలకు ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలని తెలిపారు. గత ప్రభుత్వాలు ఆర్‌ఎం పీ, పీఎంపీ వైద్యులను గుర్తించిన దాఖా లాలు లేవన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు నాయకత్వంలో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీరవీందర్, వైస్ ఎంపీపీ కృష్ణాగౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మధు, జిల్లా నాయకులు రవీందర్‌రావు, ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యుల అధ్యక్షులు శ్రీనివాస్, రాములు, సుధాకర్, వేణుగోపాల్, కనకయ్య, శంబయ్య తదితరులు పాల్గొన్నారు.

### కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ ఆధ్వర్యంలో...

సీఎం కేసీఆర్‌కు మద్దతు తెలుపుతూ గజ్వేల్ నియోజకవర్గ కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ ఆధ్వర్యంలో ఏకగ్రీవ తీర్మాన పత్రాలను ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో సం ఘం బాధ్యులు దేవదాస్, వెంకటేశ్వర్లు, రాజాగౌడ్, నిమ్మ రమేశ్ పాల్గొన్నారు.

# అభివృద్ధికి ప్రతీక అమీన్‌పూర్

## - ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

అమీన్‌పూర్, అక్టోబర్ 18: అమీన్‌పూర్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేసి రూ.200 కోట్లతో అభివృద్ధి చేసినట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని కేఎస్సార్ కాలనీలో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిపాలన వికేంద్రీకరణతో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించాలన్న సమున్నత లక్ష్యంతో సీఎం కేసీఆర్ అమీన్‌పూర్ పంచాయతీని మున్సిపాలిటీగా రూపొందించారన్నారు. అనంతరం ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశామని, అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రతిఒక్కరికీ నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించాలనే లక్ష్యంతో మూడు బస్తీ దవాఖానలు ఏర్పాటు, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం సైతం మంజూరు చేయించినట్లు తెలిపారు. బిందెడు నీటి కోసం రోజుల తరబడి వేచి చూసే పరిస్థితుల నుంచి ప్రతి రోజు రక్షిత మంచినీరు అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కిందన్నారు. మున్సిపల్ పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నాలుగేళ్ల కాలంలో 10 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో ఐదు భారీ రిజర్వాయర్లు నిర్మించి మెరుగైన మంచినీటి సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. అనంతరం బీరంగూడ గోశాలలో ప్రత్యేక పూజలు చేశారు.

**విగ్రహ ప్రతిష్ఠాపనలో..**

అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడ గ్రామంలోని బీఎస్‌ఆర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శివాలయం, హనుమాన్, వినాయక దేవాలయాల్లో ఏర్పాటు చేసిన విగ్రహ ప్రతిష్ఠాపనల కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ ప్రజలు ఘన స్వాగతం పలికి ఆత్మీయ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ ఎంపీపీ దేవానంద్, జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా

- పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి
- ఆయుధాల లైసెన్సులు కలిగిన వారి నుంచి వివరాల సేకరించాలి
- నేర సంబంధమున్న వారిపై నిరంతరం నిఘా ఉండాలి
- మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా

మెదక్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): శాసనసభ ఎన్నికలను పారదర్శకంగా, నిపక్షపాతంగా నిర్వహించేందుకు మీడియా సహకరించాలని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ)ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ రోహిణి ప్రియ దర్శిని, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లతో పరిశీలించారు. మీడియా సెంటర్‌లో ఉన్న సదుపాయాలను ఎంసీఎంసీ పనితీరుకు సంబంధించిన ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయనున్నాట్లు తెలిపారు. ఎంసీఎంసీ సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలను ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కించడం, సోషల్ మీడియాలో అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రకటనలకు వంటివి సకాలంలో ఆమోదిస్తూ, మంజూరు చేయాలని సూచించారు. శాటిలైట్ చానెల్స్‌లో వచ్చే వార్తలను పూర్తిస్థాయిలో రికార్డు చేయాలన్నారు. వార్తా పత్రికలు, ఈ-పేపర్లు, టెలివిజన్ చానెళ్లు, స్థానిక కేబుల్ నెట్ వర్కు, సోషల్ మీడియా, మూవీ హౌస్‌లు, సంక్షిప్త సందేశాలు, ఇతర ఆడియో-వీడియో విజువల్ మీడియాలతో సహ ప్రకటనలను ఎంసీఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందిన తర్వాతే విడుదల చేయాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి మీడియా పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు.

### వేగంగా మౌలిక సదుపాయాలు కల్పించాలి

పోలింగ్ కేంద్రాల్లో వేగంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మరమ్మతులు, మిగిలిన పనులను ఈ నెల 30వ తేదీ వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. మన ఊరు- మనబడి పనులు పూర్తి చేయాలని, పంచాయతీ సమన్వయంతో పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్, షామియానాలు కల్పించాలన్నారు. దివ్యాంగుల కోసం ర్యాంప్ ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అధికారులంతా జాయింట్ టీమ్‌గా పని చేయాలని, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ, బ్యాలెట్ పేపర్ తయారీ, ప్రతి పోలింగ్‌స్టేషన్‌ని పెండింగ్ పనులు పూర్తి చేయాలని, బూత్ లెవల్ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. స్వీప్ కార్యక్రమంలో అన్ని శాఖల సమన్వయంతో పాల్గొని ఓటింగ్ శాతం పెంచాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## ఆయుధాల లైసెన్సులు కలిగిన వారి వివరాల సేకరణ

మెదక్ అర్బన్,అక్టోబర్18:రాష్ట్ర శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ఆయుధాల చట్టం 1959లోని సెక్షన్ 21 ప్రకారం లైసెన్సింగ్ అథారిటీ ద్వారా అనుమతులు పొందిన ఆయుధాల లైసెన్సు కల్గి ఉన్న వివరాలు సేకరించామని కలెక్టర్ తెలిపారు. ప్రజా శాంతి, ప్రశాంతతను కాపాడేందుకు మెదక్ జిల్లా పరిధిలో నివసిస్తున్న ఆయుధాల లైసెన్సులు కలిగిన వారి అందరి వివరాల సేకరణ చేశారు. లైసెన్స్ దారులు పోలీసుల ఆదేశాలు పాటిండంలో విఫలమైతే చట్టంలోని తగిన నిబంధనల ప్రకారం చర్య తీసుకుంటామని వారు పేర్కొన్నారు. అధికారులు జాయింట్ టీమ్‌గా పనిచేయాలని, ఫీల్డ్ టీమ్‌గ్ ఏర్పడాలని, నేర సంబంధ కల్గిన వారి వివరాలు సేకరించాలని, ఉచిత మద్యపానం సరఫరా అయిందా అనే వివరాలు సేకరించాలన్నారు. వివిధ వాహనాల్లో రకరకాల వస్తువుల రవాణాపై నిఘా పెట్టాలని, పోస్టాఫీసులో ఒకే సారి వివిధ రకాల ఆర్డర్స్‌పై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. బ్యాంకుల్లో ఒకేసారిగా 10 లక్షల రూపాయలు డిపాజిట్ చేస్తే, వారి వివరాలు సేకరించాలని, అలాగే రూ.10లక్షల కంటే పైన డిపాజిట్ అయితే వారి వివరాలు సేకరించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, సీటీఓ మహేందర్‌రెడ్డి, ఆర్డీవో రిచర్డ్ ఏ ముత్తు, ఆడిషనల్ ఎస్పీ మహేందర్ పాల్గొన్నారు.